క్షేమంగా స్వస్థలాలకు..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఒడిశా రైలు ప్రమాదంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో చిక్కుకున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు సురక్షితంగా శనివారం రాత్రి స్వస్థలాలకు చేరుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు, పెంటపాడు మండలం ముదునూరు గ్రామానికి చెందిన రంజిత్ దాలి వ్యాపారం నిమిత్తం ఉత్తరాఖండ్ వెళ్లారు. అక్కడ తిరిగి నుంచి కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో స్వస్థలానికి బయలుదేరారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న రైలు ఒడిశాలో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో వారు సురక్షితంగా బయటపడి శనివారంరాత్రికి తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వీరిని రైల్వే ఎస్ఐ జి.హరిబాబు బంధువులకు అప్పగించారు.

'లో ఓల్టేజీ'తో ఉక్కిరిబిక్కిరి..!

కరెంటు కష్టాలతో జనం నరకయాతన

ఫ్యాన్లు తిరగవు.. లైట్లు వెలగవు

వడగాల్పులకు రాత్రిళ్లు సైతం ఉక్కపోతతో ఇబ్బందులు

నిడమర్రు మండలం అడవికొలనులో దారుణ పరిస్థితి

కరెంట్ ఉన్నా ఇన్వెర్టర్లు వాడాల్సిన పరిస్థితి

సమస్యల్లేంటూ విద్యుత్‌శాఖ అధికారుల ప్రకటనలపై విమర్శలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరెంటు కోతలు ఒకపక్క.. లో ఓల్టేజీ సమస్య మరోపక్క.. ఫలితంగా జిల్లా ప్రజానీకం నరకయాతన అనుభవిస్తుంది. విద్యుత్ కోతలు, సమస్యలు లేవని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్న మాటలు, ప్రకటనలు చూసి జనం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను పట్టించుకోకుండా విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడుతున్న తీరు అందరిలోనూ ఆగ్రహం తెప్పిస్తోంది. జిల్లాలో అనేక గ్రామాల్లో కరెంటు కోతలతో పాటు లో ఓల్టేజీ సమస్య జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ సమస్యతో నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన ప్రజలు పడుతున్న ఇబ్బందులే నిదర్శనంగా చెప్పొచ్చు. కరెంటు ఉన్నప్పటికీ ఆపేసి ఇన్వర్టర్‌పై ఫ్యాన్లు తిప్పాల్సి దుస్థితి అ గ్రామంలో ఉంది. గ్రామంలో స్టేజీ వద్ద నుంచి పంచాయతీకి వెళ్లే రోడ్డులో ఉన్న ప్రజలు మాట్లాడుతూ రాత్రీ, పగలు నిద్రలేకుండా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది లక్షలకుపైగా గృహవిద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో పేద, మధ్యతరగతి విద్యుత్ కనెక్షన్లు అత్యధికం. వేసవి ప్రారంభమైన తర్వాత సామాన్య ప్రజానీకం అనుభవిస్తున్న విద్యుత్ కష్టాలు అన్నీఇన్నీ కావు. కొద్దిరోజులుగా నిత్యం జిల్లాలో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. వడగాల్పుతో జనం అల్లాడిపోతున్నారు. ఎండవేడికి బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. రెండు రోజులుగా వడగాల్పులు మరింత తీవ్రమయ్యాయి. కరెంటు సమస్యలతో ఇంట్లో కూడా ఉండలేని పరిస్థితి నెలకొనడంతో జనాలకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. లోడ్‌రిలీఫ్ పేరుతో ప్రతీరోజు విధించే విద్యుత్ కోతలకు తోడు లో ఓల్టేజీ సమస్య జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కరెంటు ఉన్నా లేనట్టుగానే పరిస్థితి తయారైంది. లో ఓల్టేజీతో ఫ్యాన్లు చాలా నెమ్మదిగా తిరుగుతుండటంతో గాలిరాని పరిస్థితి నెలకొంది. పగలు, రాత్రి సైతం ఇదే పరిస్థితి నెలకొంది. అడవికొలనులో పరిస్థితి మరింత తీవ్రతరంగా ఉండటంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా నిద్రలేక అవస్థలు పడుతున్నారు.

రాత్రిళ్లు సైతం వేడిగా ఉండటం, ఫ్యాన్లు తిరగకపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ధనికులు ఉన్న కొన్ని ప్రాంతాలకే అవి పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లో ఓల్టేజీ సమస్యతో ఎసిలు సైతం పనిచేయడం లేదు.

ముఖ్యంగా డెల్టా మండలాల్లో ఆక్వాకు కరెంటు సరఫరా ఇబ్బందులు లేకుండా చేస్తున్న కారణంగా గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య వస్తుందన్న చర్చ సైతం సాగుతోంది. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు. నిడమర్రు మండలం అడవికొలనులో ఓల్టేజ్ సమస్యపై ఎఇ మురళీకృష్ణను వివరణకోరగా గ్రామంలో రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించామని, ఎక్కడా సమస్య లేదని చెప్పారు.

విద్యుత్ కోతలతో ప్రజలు విలవిల

ఆచంట : విద్యుత్ కోతలు లేవంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్నప్పటికీ గంట, గంటకు నిలిచిపోతున్న విద్యుత్ సరఫరాతో ఆచంట నియోజకవర్గంలోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా విద్యుత్ కోతలకు అంతులేకుండా పోయింది. శుక్రవారం సాయంత్రం 7 గంటల 30 నిమిషాల నుంచి శనివారం తెల్లవారుజాము రెండు గంటల వరకు ఏకధాటిగా సుమారు ఏడు గంటల వరకూ విద్యుత్తును నిలిపేయడంతో ప్రజల అనేక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గత రెండు రోజులుగా విద్యుత్ కోతలకు అంతులేకుండా పోయింది. తెల్లవారకముందే ప్రారంభమవుతున్న కోతలతో వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే మండుతున్న ఎండలకు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే దీనికితోడు విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉందంటూ ఆర్భాట ప్రకటన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు విద్యుత్ కోతలు తోడవడంతో కనీసం ఫ్యాను తిరగక ఇంట్లో కూర్చోవడమే కష్టంగా మారిందంటూ ప్రజలు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ కోతలు లేవంటూనే కోతలు విధించడం మానుకోవాలని నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

'ఉపాధి'ని నిరుగార్చేందుకే నిబంధనలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ పనుల్లో ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో పర్యటనలో భాగంగా శనివారం పుల్లయ్యగూడెం, నీలాద్రిపురం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పుల్లయ్యగూడెంలో గత ఏడాది బకాయిలు నేటికీ చెల్లించలేదని పలువురు కూలీలు నాయకులకు వివరించారు. అలాగే రెండు పూటలా పని, ఫొటో అప్‌లోడ్ వంటి విధానాలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సాంకేతిక లోపాల వల్ల మస్తర్లు త్వరగా పడటం లేదని తక్షణం ఈ విధానం రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే మస్తర్లు కొనసాగించాలన్నారు. వేసవి అలవెన్సు, మెటీరియల్‌ను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళా కూలీలు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల రూతమ్మ, నారదన్న, రమణమ్మ, చెరుకు నాగమణి, పుట్టా సుబ్బారావు, మైలవరపు నాగేశ్వరరావు, బుర్రనెల బాలుడు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న సోమరాజు

నాడు-నేడు పనుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - పాలకోడేరు

'మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.. కనీసం పాఠశాల ప్రాంగణంలో శుభ్రత లేదు.. ఎన్ని నిధులు మంజూరయ్యాయి.. ఎన్ని పనులు చేశారు.. పనులు ముందుకు సాగకపోవడానికి కారణాలేంటి.. అసలు మీరు ఏం చేస్తున్నారు' అంటూ కలెక్టర్ పి.ప్రశాంతి ఇంజనీరింగ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంద్ర, పెన్నాడ గ్రామాల్లో కలెక్టర్ శనివారం పర్యటించారు. వేంద్ర స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే అక్కడ ఏలాంటి పనులూ జరగకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. ఈ పనులకు బాధ్యత వహించాల్సిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్మయి, పాఠశాల ప్రధానోప్రధానోపాధ్యాయులు సురేష్ పనితీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు-నేడు పథకంలో 22 పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు రూ.15 లక్షలు మంజూరయ్యాయని, దీనిలో ఆర్ఎఫ్ నిధులు మరో రూ.ఎనిమిది లక్షల 14 వేలు మంజూరయ్యాయని ఇంజనీరింగ్ అసిస్టెంట్, హెచ్ఎం కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. ఈ నిధుల్లో రూ.నాలుగు లక్షలతో ప్రహరీ నిర్మాణం, మిగిలిన నిధులతో మరుగుదొడ్లు, మరమ్మతులు, వంటగది నిర్మాణం, స్టోన్ వర్క్‌కు ఖర్చు చేశామని చెప్పారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ఆర్ఎఫ్ నిధులతో ప్రహరీని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని, కనీసం పాఠశాల ప్రాంగణం శుభ్రత కూడా లేదని, మంజూరైన నిధులు వేరే పనులకు కేటాయిస్తే మిగిలిన రూ.25 వేలతో మీరు ఏం పనులు పూర్తి చేస్తారని మండిపడ్డారు. అనంతరం పనులను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి నాడు-నేడు పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పెన్నాడ అగ్రహారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ ఆర్‌వి.రమణ, ఐసిడిఎస్ పీడీ సుజాతా రాణి, మండల ప్రత్యేక అధికారి బివి.రమణ, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ మురళీగంగాధర్, ఆర్ఐ నాగభూషణరావు, హౌసింగ్ ఎఇ నరసింహ, ఎంఇఒ లక్ష్మణమూర్తి, కార్యదర్శులు ఎ.పోలయ్య, కెచలక్ష్మి, విఆర్‌ఒలు అలేఖ్య, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, అధికారులు ఉన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని, నేటి చిన్న మొత్తాల పొదుపు రేపటి ఆర్థిక గుర్తింపునకు దోహదపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం భీమవరం హెడ్‌పోస్టాఫీస్ సమీపంలోని ఆర్యవైశ్య వర్తక భవనంలో ఏర్పాటు చేసిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే గౌరవం పెరుగుతుందన్నారు. బ్యాంకులతో సరిసాటిగా పోస్టాఫీస్‌లో 12,490 పైబడి ఖాతాలు ప్రారంభించడం వాటి ద్వారా సుమారు రూ.పది కోట్ల 40 లక్షల నగదు జమ కావడం చాలా గొప్ప విషయమన్నారు. ఎస్‌హెచ్‌జిలు, జెఎల్‌జిలు బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీల నిర్వహణకు డిఆర్‌డిఎ సిబ్బంది సహకారం అందిస్తారని, అదే విధమైన సహకారం పోస్టల్ కార్యాలయాలకు కూడా ఉంటే మరింత ఎక్కువ ఖాతాలు ప్రారంభించుకోవడానికి దోహదపడుతుందన్నారు. మహిళలు, ఆడపిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పొదుపు పథకం ప్రారంభించిందన్నారు. భీమవరం పోస్ట్ ఆఫీస్ సీనియర్ పోస్టల్ పర్యవేక్షకులు పి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాలునిండిన, మైనర్ ఆడపిల్లల పేర్లతో ఈ ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. కనిష్టంగా రూ.వెయ్యి, గరిష్టంగా రూ.రెండు లక్షలతో ఖాతాను ప్రాంభించవచ్చన్నారు. రెండు లక్షల లోపు ఎన్ని ఖాతాలు అయినా తెరవొచ్చని, అయితే ఖాతాకు ఖాతాకు మధ్య మూడు నెలల వ్యవధి ఉండాలన్నారు. ఖాతా గడువు కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని, వడ్డీ 7.5 శాతం వడ్డీ త్రైమాసిక పాతిపదికన కలిపి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ప్రశాంతి స్వయంగా ప్రారంభించిన అకౌంట్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు పోస్టల్ సర్వీసు డైరెక్టర్ సందేశ్‌మహాదేవ అప్పా కలెక్టర్ అందజేశారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్లను ఖాతాదారులకు కలెక్టర్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ జనరల్ డిఎస్‌విఆర్.మూర్తి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.సుబ్రహ్మణ్యం, పురపాలక సంఘం కమిషనరు శివరామకృష్ణ, పోస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాదం పట్ల సిపిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మీతులకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి అన్ని విధాలా మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతులకు, గాయపడిన వారికి పెద్దమొత్తంలో నష్టపరిహారం అందించాలని, ఆయా కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకే పట్టాలపై అనుకోకుండా రెండు రైళ్లు వస్తే ప్రమాదం జరగకుండా నిరోధించే కవచ్ టెక్నాలజీ సిస్టం గురించి రైల్వేశాఖ చెప్పింది, ప్రచారం చేసింది ఏమైందని బలరాం ప్రశ్నించారు. గాయపడిన వారికి రక్తం ఇచ్చేందుకు సిద్ధపడటం, సహాయక చర్యల్లో పాల్గొనేందుకు స్థానికులు వందల సంఖ్యలో ముందుకు రావడం మానవత్వాన్ని సూచిస్తున్న గొప్ప విషయమని పేర్కొన్నారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం

ఒడిశా రాష్ట్రంలో రైలు ప్రమాదం దృష్ట్యా జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైలు ప్రమాదంలో జిల్లాలకు సంబంధించి ఎవరైనా చిక్కుకుంటే వివరాలు తెలపాలని కోరారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08816 299219 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియచేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - ఆచంట

అత్యధిక నిధులు వెచ్చించి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తున్నారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. ఆచంటలో శనివారం ఉదయం రూ.కోటీ 10 లక్షలతో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శిలాఫలకాలు ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు. ఆచంట పంచాయతీ పరిధి పెదపేటకు సంబంధించి రూ.20 లక్షలతో నిర్మించనున్న ఎస్‌సి కమిటీ హాల్, అలాగే రూ.20 లక్షలతో నిర్మించనున్న కాపు కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపనలు చేశారు. రూ.13 లక్షలతో కాపు, శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో ఉప్పరి కులస్తులకు కమ్యూనిటీ హాలు, ఎస్‌సి మాదిగ కులస్తులకు రూ.12 లక్షలు, విశ్వబ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, వెన్నపువారిపాలెం ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కొయ్యే మోషేనురాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రగతి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో రంగనాథరాజు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 52 గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుకు తన వంతు కషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం అయితే నూరు శాతం ఫలితాలు సాధించవచ్చన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సర్పంచులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి ఛైర్మన్ మోషేను రాజు, నేతలు

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

భానుడి భగభగ..

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో శనివారం కూడా రోహిణీ కార్తె ప్రభావంతో ఎండ ఎక్కువగా ఉంది. దీంతో వారపుసంత రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం వ్యాపారం లేక వ్యాపారులు షాపులు కట్టి తిరిగి సాయంత్రం తెరిచారు. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేదల పక్షమా.. పెద్దల పక్షమా..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణం పేరిట పేదలకు పెద్దసంఖ్యలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇది కచ్చితంగా స్వాగతించాల్సిన అంశం. అదే సమయంలో ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇదే జరిగితే ప్రభుత్వం పదే పదే చెబుతున్నట్లు పేదల కోసం ఇళ్లే కాదు ఊళ్లకు ఊళ్లే నిర్మించినట్లు ఇది కచ్చితంగా పేదల అభ్యున్నతికి పాటు పడే ప్రభుత్వంగా పేరొందుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమికి సంబంధించిన రైతుల ఆందోళన సర్వత్రా చర్చనీయాంశమైంది.

దీనికి పశ్చిమగోదావరి జిల్లాలో మండల కేంద్రమైన పాలకోడేరు, ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం మండలంలో లక్కవరం గ్రామంలో ఇటీవల భూనిర్వాసితులైన పేద రైతుల ఆందోళనలే నిదర్శనం. ప్రభుత్వం జగనన్న ఇళ్ల కాలనీలకు భూమి రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినట్లు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటోంది. దీనిలో వాస్తవం లేకపోలేదు. అయితే చాలా కాలం క్రితం వివిధ రూపాల్లో పేదలు ప్రభుత్వం నుంచి సాగు చేసుకుంటున్న భూములు వారి వారసులు అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో పట్టాలు పొందినవారిని మభ్యపెట్టి, తరిమికొట్టి పెద్దలు ఆక్రమించిన ఘటనలకు ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడు భూ పోరాటమే ప్రత్యేక్ష నిదర్శనం. అలా ప్రభుత్వ భూములు అక్రమంగా అనుభవిస్తున్న పెద్దల నుంచి భూములు స్వాధీనం చేసుకున్న పేదలకు అప్పగిస్తే అభ్యంతరాలేమీ ఉండవు. కాని పేదల అనుభవంలో ఉన్న భూములు లే అవుట్లుగా గుర్తించి తొలుత పరిహారం ఇస్తామని నమ్మించి భూములు అప్పగించాక అవి ప్రభుత్వ భూములైనందున పరిహారం ఇచ్చేది లేదనడం అత్యంత దారుణం. ఒకవిధంగా చెప్పాలంటే పేదల వద్ద భూములు లాక్కుని పేదలకు పంచడం ప్రభుత్వ అసమర్థతకు, వైఫల్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఒకవేళ అనివార్యంగా పేదల అనుభవంలోని భూములే లే అవుట్లుగా మార్చాల్సి వస్తే కచ్చితంగా మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వడం లేదా ఆ భూములకు ప్రత్యామ్నాయంగా మరో భూమి చూపి సాగుకు కొంత ఆర్థిక సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత. అయితే పాలకోడేరు, లక్కవరంలో అధికారులు, ప్రభుత్వం నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి పేదల భూములు లాక్కుని పరిహారం సైతం ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారు. ఫలితంగా పాలకోడేరు ఇప్పటికే భూ నిర్వాసితులైన ఓ పేదరైతు మనోవేదనతో ప్రాణాలివ్వగా మరో పేద రైతు కుటుంబం తీవ్ర అనారోగ్యం పాలైంది. లక్కవరంలోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. దీనిపై ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యాన పేదలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. దీనికి అఖిలపక్షం, ప్రజాసంఘాలు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. ఇంత పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నా జిల్లా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రం భీమవరానికి కూతవేటు దూరంలో పాలకోడేరులో పేదల ఆందోళన జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కనిపించడంలేదా అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లక్కవరంలో పేదలు బలవన్మరణానికి సైతం సిద్ధపడడం ఆందోళన, బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భూ నిర్వాసితులైన పేద రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. లేనిపక్షంలో వైసిపి ప్రభుత్వ పెద్దలు పదేపదే తమది పేదల ప్రభుత్వమని, రైతుల ప్రభుత్వమని చెబుతున్నవన్నీ వట్టి మాటలేనని, పెద్దల పక్ష ప్రభుత్వమని జనం భావిస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

హిందీ పరీక్షకు 1,808 మంది హాజరు

ప్రజాశక్తి - భీమవరం

పది సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో భాగంగా శనివారం హింది పరీక్షకు 2516 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1808 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 708 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మొత్తం 71.86 హాజరు శాతం నమోదైందని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 19 పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వారు 2 పరీక్షా కేంద్రాలు మొత్తం 21 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు

భీమవరం : ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి జిల్లా కేంద్రం భీమవరంలో వీరమ్మ చెరువు దగ్గర ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం స్పాట్ పోస్టర్ పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు అప్ కాస్ట్ జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలకు 3 నుండి 9 తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎవరి డ్రాయింగ్ సామగ్రి వారే తెచ్చుకోవాలని సూచించారు.



నిరసన దీక్ష చేపట్టిన ఎంఎల్ఎ రామరాజు, టిడిపి శ్రేణులు

ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేవరకూ దీక్ష

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక ఆరో వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం పట్ల ఎంఎల్ఎ రామరాజు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన టిడిపి శ్రేణులతో కలిసి శనివారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన దీక్ష ప్రారంభించారు. ఈ దీక్ష రాత్రి కొనసాగుతుందని ప్రకటించారు. ప్రజలకు వేసవిలో విద్యుత్తు అత్యంత అవసరమన్నారు. అందుకని ఓల్టేజ్ సమస్య తీర్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఉపయోగం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడానికి అధికారులు నిర్లక్ష్యమా లేక ఏమైనా ఫార్మాలిటీలు ఉంటాయా అంటూ ఆయన ప్రశ్నించారు. అధికారులు వివాదం సృష్టిస్తున్నారన్నారు. కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన ప్రజాప్రతినిధి నగర పంచాయతీ కౌన్సిలర్‌ను అవమానించడం అధికారులకు ఎంత మాత్రం తగదన్నారు. వెంటనే ప్రజాప్రతినిధికి క్షమాపణ చెప్పి ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు రెండూ నెరవేరే వరకు దీక్షను విరమించేది లేదని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లం రంగారావు, గంధం ఉమా సత్యనారాయణ, గొంట్ల గణపతి, ఉండే అజ్మల్, కౌన్సిలర్లు గుర్రాన్ని నాగలక్ష్మి, ఇల్లాపు కృష్ణవేణి, చొక్కా సుబ్బారావు పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కవురు శ్రీనివాస్

త్వరగా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తిచేయాలి

ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను శనివారం ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, హాస్పిటల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు చినమిల్లి గణపతి, చెన్ను విజయ్, కోరాడ శ్రీను, ఎం.శ్రీనుబాబు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి చినపేటలో అమృత్ సరోవర్‌లో భాగంగా మంజూరైన నిధులతో శరవేగంగా జరుగుతున్న మంచినీటి చెరువు ఆధునికీకరణ పనులను జిల్లా తనిఖీ బృందం శనివారం పరిశీలించింది. తనిఖీ బృందం ఇన్‌ఛార్జి పోడూరు అగ్రికల్చర్ ఎడిఎ ఎ.పార్వతి మాట్లాడుతూ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే విధంగా చెరువుగట్టు చుట్టూ పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. త్వరితగతిన చెర్వు పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. త్వరలో సెంట్రల్ తనిఖీ బృందం పర్యటిస్తోందని, ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆమె తెలిపారు. చెరువుల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మణికంఠ, ఫీల్డ్ అసిస్టెంట్, కోటే శశిమధు, సిఐ పోచమ్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సైకిల్ వాడకం ఆరోగ్యదాయకమని ట్రాఫిక్ సిఐ జి.దాసు అన్నారు. పిపి రోడ్డులోని మస్తాన్ సైకిల్ షాపు వద్ద శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ సైకిల్ ఒక ఆభరణంగా ఉండేవని, నవీన యుగంలో సైకిల్ తొక్కడం చాలా వరకూ తగ్గించారని, తద్వారా బరువు పెరగడం, అనారోగ్యాలు రావడం జరుగుతున్నాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వారంలో ఒకరోజైన అందరూ సైకిల్ వాడాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి సైకిల్ షాప్ నిర్వాహకులు మస్తాన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాస్, కె.ఇందిర, ఎండి సరోజినీ, గంటా సుందర కుమార్, సైకిల్ షాప్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

డైమండ్స్ లయన్స్ ఆధ్వర్యాన అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వృద్ధులకు నిరాశ్రయులకు చేయూత నివ్వడం మన బాధ్యతని డైమండ్స్ లయన్స్ క్లబ్ ట్రెజరర్ లయన్ మునగాల జితేంద్ర కుమార్ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డికెడి.సత్యనారాయణ సహకారంతో డికెడి.మధు పుట్టినరోజు సందర్భంగా పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. రామారావు పేటలోని శ్రీబృందావనం వద్ద మహిళలకు బియ్యం,నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ చిక్కాల అంబికా, లయన్ రేణుక, లయన్ రామలక్ష్మి, లియో మాధురి, లియో నందిని పాల్గొన్నారు.

మొగల్తూరులో భూ సర్వే

మొగల్తూరు :మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సమగ్ర భూ సర్వేను డ్రోన్ సాయంతో ప్రారంభించారు. తొందరలోనే సర్వే పూర్తి చేస్తామని గ్రామ పంచాయతీకి పొలిమేర హద్దులను సర్వేలో గుర్తించామని తహశీల్దార్ జి.అనితకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వే ధనరాజు, సర్పంచులు పడవల మేరీ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్

భీమవరం రూరల్:ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ ఉదయం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు శనివారం కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జెఎన్ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీన నిపుణులైన ఫ్యాకల్టీతో ప్రొఫెషనల్ కెరీర్ గైడెన్స్ అండ్ ప్రాజెక్ట్ ప్లానింగ్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఏ విధమైన మార్గాన్ని ఎంచుకొని ప్రయాణిస్తే బాగుంటుంది తదితర అంశాల గురించి కెరీర్ గైడెన్స్‌లో వివరించడం జరుగుతుందన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థులు జెఎన్ డిపార్ట్‌మెంట్‌తో గాని లేదా ఈ కింది సెల్ నంబర్లతో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ధ్వంసం చేసిన మొక్కలు

చించినాడలంక భూముల్లో మళ్లీ దౌర్జన్యం

పేదలు పాతిన కొబ్బరి మొక్కలు ధ్వంసం చేయించిన అధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో పేదలకు చెందిన డి ఫారం పట్టా భూముల కింద ఉన్న పెరుగులంక భూముల్లో మట్టిని తరలించడానికి అధికారులు శనివారం సాయంత్రం మరలా దౌర్జన్యానికి దిగారు. ఇటీవల మట్టి తరలింపును అడ్డుకున్న పేదలు సామూహికంగా స్టే ఆర్డర్ ఉన్న భూమిలో నాటిన కొబ్బరి మొక్కలను సైతం బుల్డోజర్‌తో ధ్వంసం చేయించి మట్టిని తరలించడానికి ప్రయత్నం చేశారు. అయితే ఆ భూములకు చెందిన పేదలు అడ్డుకునే ప్రయత్నం చేసిన నేపథ్యంలో మట్టి తరలింపును సుప్రీంకోర్టు వరకు వెళ్లిన పోలీసు బలగాలు ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగిస్తే అరెస్టు చేస్తామని బెదిరించే ప్రయత్నం చేశారు. దీంతో లంక భూముల కమిటీ సభ్యులు మాట్లాడుతూ మా భూములకు సంబంధించి హైకోర్టు స్టే ఆర్డర్ ఉండగా, మా భూమిలో పాతుకున్న కొబ్బరి మొక్కలను అన్యాయంగా ధ్వంసం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మట్టి తవ్వకాలకు ప్రభుత్వం నుంచి ఎవ్వరూ ఆర్డర్ కాపీ ఉంటే ఇవ్వమని అడిగిన నేపథ్యంలో మైనింగ్ డిపార్ట్మెంట్ నుంచి ఆర్డర్ కాపీని తెప్పించారు. దీంతో హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన భూమిలో మైనింగ్ డిపార్ట్మెంట్ తవ్వకాలకు ఎలా అనుమతిస్తుందని, ప్రభుత్వం ఇదే విధంగా దౌర్జన్యంగా మట్టిని తరలిస్తే దీనిపై న్యాయపోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లంక భూముల కమిటీ సభ్యులు పిల్లి ఏడుకొండలు, కానేటి బాలరాజు, చెల్లుబోయిన వడ్డి కాసులు, తెన్నేటి స్టాలిన్, సెల్లిమి భాస్కరరావు, ముదాల రాజేష్, విప్పర్తి నన్ని, బూసి దానియేలు, ముదాల జైసింగ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గుర్రపు డెక్కతో నిండి ఉన్న వెంకయ్య వయ్యేరు పంట కాలువ

పసర్లుగా ఉన్న అయ్యకోడు ఛానల్

కాలుష్య కాసారాలు.. పంట కాలువలు!

పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క - వ్యర్థాలతో కాలువలు కలుషితం - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఇటీవల మూడు డెల్టాలకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముందుస్తుగా నీటిని విడుదల చేసినా పంట కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, వ్యర్థాల తొలగింపు పనులు అంతంత మాత్రమే జరిగాయి. ఈ వేసవిలో కాలువల శుభ్రతను ఇరిగేషన్ శాఖ అధికారులు గాలికొదిలేశారు.దీంతో వ్యర్థాలు పేరుకుపోయి కాలువలు కలుషితమయ్యాయి.

ఒకప్పుడు గోదావరి డెల్టా పంట కాలువల నుంచి నీటిని నేరుగా తాగునీటిగా ఉపయోగించేవారు. ఆక్వారంగం గణనీయంగా పెరగడంతో పంట కాలువల్లో నీరు కలుషితమైంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం పంట కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. ఇళ్లల్లోని వాడకపు నీరు, మరుగుదొడ్ల వ్యర్థాలను యథేచ్ఛగా కాలువల్లో కలిపేస్తున్నారు. కాలువల్లో పశువులను కడగడం, బట్టలుతకడం, ఆక్వా చెరువుల వ్యర్థాలు నేరుగా పంట కాలువల్లోకి వదిలేయడంతో డెల్టా కాలువలు పూర్తిగా కలుషితమైపోతున్నాయి.

ప్రధాన పంట కాలువల్లో కాలుష్యం..

వెంకయ్య వయ్యేరు, ఉండి కాలువలు ప్రధానంగా ఉన్నాయి. వెంకయ్య వయ్యేరు పంట కాలువ సుమారు 150 గ్రామాలకు, ఉండి కాలువ 86 గ్రామాలకు తాగు, సాగునీరు అందిస్తోంది. పంట కాలువలోకి కలుషిత నీటిని వదిలేయడంతో కాలుష్యమయంగా మారుతోంది. ఫలితంగా స్వచ్ఛతను కోల్పోయి, నీటి రంగు మారిపోయింది. ఈ నీటిని తాగి ప్రజలు జీర్ణ, ఊపిరితిత్తులు, కేన్సర్ వ్యాధుల బారిన పడుతున్నారు.

కొన్ని దశాబ్దాల కిందట కాలువల్లోకి వ్యర్థాలు రాకుండా పంట కాలువలు మూసివేత సమయంలో ఇరిగేషన్ అధికారులు కొంత కట్టడి చేసేవారు. నోటీసులు ఇవ్వడం, అపరాధ రుసుములు వసూలు చేయడం, దగ్గరుండి కాలువల్లోని మురుగు నీటిని తొలగించడం వంటి చర్యలు చేపట్టేవారు. రెండు దశాబ్దాల నుంచి కాలువల శుభ్రతను ఆ శాఖ అధికారులు గాలికొదిలేశారు. లస్కర్ల వ్యవస్థ ఉన్నదే తక్కువ. వీరిలో పని చేసేవారు మరింత తక్కువ కావడంతో వ్యర్థాలు యథేచ్ఛగా కలిసిపోతున్నాయి. సాధారణంగా కాలువల మూసివేత సమయంలోనే మురుగునీరు కలిసే ప్రాంతాలను గుర్తించే అవకాశం ఉంది. ఒక విధంగా చెప్పాలంటే వ్యర్థాలు కలవకుండా అడ్డుకోవడానికి ఇదే సమయం అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పంట కాలువల్లోకి ఉప్పునీరు..

వెంకయ్య వయ్యేరు, ఉండి కెనాల్, అనాకోడేరు పంట కాలువల ద్వారా మండలంలోని 21 గ్రామాలకు తాగునీరు అందుతోంది. అయితే ఏలూరుపాడు 1, 2 ఛానల్, అన్నయ్యకోడు, అజ్జమూరు, కాళ్ల లంక, కోలనపల్లి, సీసలి న్యూ, సీసలి ఓల్డ్, బొండాడ, పెదఅమిరం, నారాయణకోడు, వాండ్రం ఛానళ్ళు ఉన్నాయి. ఉప్పుటేరు తీర ప్రాంతాల్లో ఉప్పునీరు నేరుగా పంటకాలువల్లోకి చేరుతోంది. దీంతో పంట కాలువలు కాలుష్యంగా మారుతున్నాయి. ఈ నీటిని పంచాయతీలు శుభ్రపర్చినా స్వచ్ఛమైన తాగునీరందని పరిస్థితి. క్లోరినేషన్ చేసినా కాలువలో వ్యర్థాలు, ప్రమాదకర రసాయనాలు పూర్తిగా తొలగడం లేదు. ఈ కారణంగానే పంచాయతీల్లో ఆర్ఒ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి.

కాలుష్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి..

ఎంవి.రవివర్మ, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ట్రెజరర్, ఏలూరుపాడు

గతంలో పంట కాలువల్లో కాలుష్యం ఈ స్థాయిలో ఉండేది కాదు. పంచాయతీలు కూడా కాలుష్యానికి కారణం అవుతున్నాయి. డ్రెయిన్ల నుంచి మురుగునీటిని నేరుగా కాలువలోకి వదిలేస్తున్నారు. ఆక్వాచెరువు నుంచి కలుషిత నీటిని పంట కాలువలోకి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. కలుషిత నీరు బయటకెళ్లే ఏర్పాట్లు చేయాలి.

అతిసార నివారణపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - గణపవరం

అతిసార నివారణకు పిప్పర పిహెచ్‌సిలో వైద్య సిబ్బందికి శనివారం శిక్షణ ప్రారంభించినట్లు కేంద్ర డాక్టర్ కె.ప్రియాంక తెలిపారు. 14 రోజుల పాటు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలకు అతిసార లక్షణాలు కనిపిస్తే వారికి ఒఆర్‌ఎస్ ద్రావణంతోపాటు జింకు మాత్రలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ ఎన్‌వి.అన్నకుమారి హెచ్‌విటివి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పంట కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు అధిక పని దినాలు కల్పించడంలో భాగంగా ఉండి ప్రధాన పంట కాలువ వెంబడి చెత్తాచెదారం, గుర్రపుడెక్క, తూడు తొలగించడం జరుగుతుందని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరమల్లు మహేష్ తెలిపారు. కాలువలో ఉపాధి కూలీలు దిగి పనిచేసే సమయంలో కాలువలోని సీసా పెంకులు, గాజు ముక్కలు కాళ్లలో గుచ్చుకుంటే ప్రథమ చికిత్స చేసేందుకు తమ వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్‌ను ఉంచుకుంటున్నట్లు మహేష్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తున్నామని, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో శనివారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా 29వ వార్డు సంజీవయ్య నగర్‌లో రూ.25.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.75 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, అలాగే రూ.31.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నామన్నారు. ప్రతి గ్రామాన్నీ, ప్రతి వార్డునూ అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భీమవరం పట్టణాన్ని మెట్రో సిటీగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజలు కోరుకునే ప్రతి చోటా కూడా అభివృద్ధి జరుగుతుందన్నారు. త్వరలోనే సంజీవయ్య నగర్‌కు సంబంధించి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపి వెంటనే మున్సిపల్ అధికారులకు ఎంఎల్‌ఎ ఆదేశాలు జారీ చేశారు.

తారస్థాయికి పాలకోడేరు పంచాయతీ విభేదాలు

పంచాయతీ కార్యదర్శి, సర్పంచి వ్యవహార శైలి పట్ల వార్డు సభ్యులు అసంతృప్తి

వాగ్వివాదాల మధ్య సాగిన పాలకవర్గం సమావేశం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు పంచాయతీలో ఏర్పడిన విభేదాలు తారస్థాయికి చేరాయి. గ్రామాభివృద్ధి, గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాల్సిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు పట్ల గ్రామస్తులు విసుగెత్తిపోతున్నారు. పంచాయతీలో ఏర్పడిన ఆధిపత్యపోరు తీవ్ర వివాదాస్పదంగా మారి గొడవలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాలకోడేరు పంచాయతీలో ఏర్పడిన వివాదం, అవినీతి ఆరోపణలు, పంచాయతీ కార్యదర్శి రమాలీల, సర్పంచి ఇంజేటి మరియమ్మ వ్యవహరిస్తున్న తీరు పట్ల శనివారం పాలకవర్గ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశం పంచాయతీ కార్యదర్శి రమాలీల సమక్షంలో సర్పంచి మరియమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజుతో పాటు పలువురు వార్డు సభ్యులు వివిధ సమస్యలను లేవనెత్తారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి, ఎలక్ట్రికల్, ట్యాంక్ వాచర్లకు, పిట్టర్లకు రెండు నెలలుగా జీతాలు అందించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సర్పంచి, కార్యదర్శి వ్యవహారి శైల దీనికి కారణం అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పంచాయతీ కార్యదర్శి, సర్పంచి, పరస్పర ఆరోపణలు, పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శి, సర్పంచి వ్యవహార శైలి పట్ల ఆరోపణల మధ్య సమావేశం సాగింది.

పాలకోడేరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న వార్డు సభ్యులు

సర్పంచి భర్త జోక్యంతో సమస్య

సర్పంచి ఇంజేటి మరియమ్మ భర్త లక్ష్మీపతి పంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, ఈ నేపథ్యంలో పంచాయతీలో వివాదాలు ఏర్పడడానికి కారణం అవుతున్నారని ఉపసర్పంచి దెందుకూరి వెంకటరాజు, పలువురు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పాలనాపరమైన అంశాలు, గ్రామ అభివృద్ధి, ఇతర పనులలో జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు.

కార్యదర్శి తీరు పట్ల అసంతృప్తి

పంచాయతీ కార్యదర్శి రామాలీలా తీరుపట్ల సర్పంచి మరియమ్మ, వార్డు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి వ్యవహార శైలితో సమస్యలు రెట్టింపవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, డ్రెయినేజీ వంటి మౌలిక సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని తెలిపారు. సమావేశం సాక్షిగా పాలకవర్గ సభ్యులంతా ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు బాబోయ్ అంటూ పంచాయతీ కార్యదర్శి ఎదుట చేసిన నినాదాలు ఆమె వ్యవహార శైలికి నిదర్శనమని చెప్పొచ్చు.

కనీస గౌరవం లేదు : సర్పంచి ఇంజేటి మరియమ్మ

తను సర్పంచిగా ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది కనీసం గౌరవం ఇవ్వట్లేదని సర్పంచి ఇంజేటి మరియమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన సర్పంచి కావడంతో తనకు కనీస గౌరవ మర్యాదలకు భంగం కలిగేలా అంతా వ్యవహరిస్తున్నారని వాపోయారు. తాను అంతగా చదువుకోలేదని, కనీసం బిల్లులపై సంతకాలు పెట్టించుకున్నప్పుడు వాటికి సంబంధించిన వివరాలు కూడా చెప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గత నెల 22న నిర్వహించిన పంచాయతీ పాలక వర్గ సమావేశంలో ఏర్పడిన వివాదాన్ని పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యులు డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలను సముదాయించి సమన్వయంతో ముందుకెళ్లాలని పివిఎల్ సూచించారు. అయితే ఇది జరిగిన రోజుల వ్యవధిలోని పంచాయతీలో సర్పంచి, సభ్యుల మధ్య విభేదాలు మళ్లీ తెర మీదకొచ్చాయి. దీంతో సమస్య మళ్లీ మొదటికి రావడంతో వైసిపికి ఈ విభేదాలు తలనొప్పిగా మారాయి.

5న పేరుపాలెం బీచ్ పరిశుభ్రత

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఈనెల ఐదో తేదీన పేరుపాలెం బీచ్‌లో చేపట్టనున్న పరిశుభ్రత కార్యక్రమానికి యంత్రాంగం తరలిరావాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ సూచించారు. బీచ్ పరిశుభ్రత కార్యక్రమంపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. బీచ్‌లో పర్యావరణంపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. పరిశుభ్రత కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఆ సమయంలో యంత్రాంగమంతా బీచ్‌లో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు జి.అనిత కుమారి, ఎస్ఎం.ఫాజిల్, నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపకారవేతనానికి 20 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి, మొగల్తూరు గ్రామాల్లోని జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 20 మంది ఉపకార వేతనానికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం.బాలనాగమని, మొగల్తూరులోని పెన్మత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కోప్పనాతి శ్రీవల్లి ఉపకారవేతనానికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ఎస్‌విఆర్.మూర్తిరాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12000 చొప్పున నాలుగు సంవత్సరాలకు ఉపకార వేతనం అందిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది, పలువురు గ్రామస్తులు అభినందించారు.

ఎంపికైన శ్రీవల్లి

రైలు ప్రమాదంపై మంత్రి కొట్టు దిగ్భ్రాంతి

తాడేపల్లిగూడెం:ఒడిస్సాలో శుక్రవారం రాత్రి జరిగిన రైళ్ల ప్రమాదం దుర్ఘటనపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీశైలం పర్యటనలో ఉన్న ఆయన శనివారం దీనిపై తాడేపల్లిగూడెం రైల్వే అధికారులతో ఫోన్లో ఆరాతీశారు. ఒడిశాలో ప్రమాదానికి గురైన కోరమండల్ యశ్వంతపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఉంది దీంతో ఈ రెండు రైళ్లలో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ నుంచి ఎక్కిన ప్రయాణికులు గాని దిగే ప్రయాణికులు గాని ఎవరైనా ఉన్నారా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. కేవలం ఇద్దరు మాత్రమే ఇక్కడ దిగాల్సిన వారు ఉన్నారని వారు కూడా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారని రైల్వే అధికారులు మంత్రికి తెలిపారు. ముదునూరు గ్రామానికి చెందిన రంజిత్ తాళి అనే ప్రయాణికుడు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం సాయంత్రానికే తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు సురక్షితంగా చేరుకున్నారు. ఇక్కడ దిగవలసిన నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు శనివారం రాత్రికి స్పెషల్ ట్రైన్‌లో రానున్నారని తెలిపారు. రైలు ప్రమాదంలో వందల మంది చనిపోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిల్లా సమాచార శాఖ అధికారిగా నాగేశ్వరరావు నియామకం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా టి.నాగేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు టి.నాగేశ్వరరావు శనివారం ఉదయం డిఐపిఆర్ఒగా పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు అభినందించారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, జెడ్ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26.06.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1039.10 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

కాలువలను ప్రక్షాళన చేయాలి

ప్రజాశక్తి - ఉండి

పంట, మురుగు కాలువలు చెత్తా చెదారాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని, పూడుకుపోయిన కాలువల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణంరాజు విమర్శించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోదావరి డెల్టా ప్రాంతాలైన భీమవరం రెవెన్యూ డివిజన్, నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రధాన పంట కాలువలు, మురుగు కాలువలైన మేజర్, మీడియం, మైనర్ మురుగు కాలువలు పూడుకుపోయాయని తెలిపారు. అధిక వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురై రైతులు నష్టాలు చవిచూస్తున్నారన్నారు. ప్రస్తుత వేసవికాలంలో కాలువలు, మురుగు కాలువలు ప్రక్షాళన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కపైసా కూడా నిధులు కేటాయించుకోవడంతో ప్రభుత్వానికి రైతులపై ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. పంట కాలువలు, మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల వర్షాలు వస్తే చేలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వం, అధికారులు పూడికలను తీయించాలని కోరారు.

డయేరియా మరణాల్లేకుండా చూడండి

పాలకోడేరు :గ్రామాల్లో డయేరియా మరణాలు లేకుండా వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని, అదేవిధంగా ఎండలు ఎక్కువగా కాస్తున్నందున ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ రంగనాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు, వడగలుపులపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆవశ్యకత గురించి, జింక్ టాబ్లెట్లు ఉపయోగం గురించి, డయేరియా మరణాల గురించి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించవలసిన విషయాల గురించి అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ రంగం నాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డాక్టర్ రంగనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లోని ఐదు సంవత్సరంలోపు చిన్నారులకు 2 డేస్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు 15 రోజులకు సరిపడా జింక్ టాబ్లెట్లను అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సిహెచ్ఒ సత్యనారాయణ, పిహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, శ్రీనివాస్, నాగ మునెమ్మ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం రూరల్ మండలం నరసింహపురం గ్రామకాపురస్తులు ఉద్దరాజు విజయ రాఘవేంద్ర వర్మ చెందిన **రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద బోర్డ్ రి.నెం.175/NY/2017** అవి తీసుకుని నరసింహపురం గ్రామంలోని శ్రీ రాఘవేంద్ర కాలేజీలో గల జిరాక్స్ మిషన్ వద్ద ది.30-04-2023వ తేదీన జిరాక్స్ తీయించుకొని నరసింహ పురములోని మా ఇంటికి తిరిగి వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. మార్గమధ్యములోనూ పరిసర ప్రాంతంలోనూ వెతకగా దొరకలేదు. పైన తెలిపిన నా సర్టిఫికెట్ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌నకు తెలియపరచవలసిందిగా కోరుచున్నాను.

ఉద్దరాజు విజయ రాఘవేంద్ర వర్మ
నరసింహపురం, భీమవరం మండలం.
సెల్: 91000 7778

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్లు అయిన ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు, తూర్పు వీధి, కాపురస్తులు మరియు ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, పెద తాడేపల్లి గ్రామ నివాసస్థులు అయిన **ఉయ్యూరి శ్రీనివాసరావు కుమార్తె ఉయ్యూరి లాస్యశ్రీ మరియు కుమారుడు ఉయ్యూరి చరణ్ శివసాయి విజయ్ మైనర్లు అయినందున సహజ సంరక్షకురాలు మరియు తల్లి ఉయ్యూరి విజయ పెద్దేశ్వరి** ఇచ్చిన సంజాయిషీపై ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా.., మా క్లయింట్లు తండ్రి గారైన శ్రీనివాసరావు గార్కి పెద తాడేపల్లి గ్రామంలో రి.స.నెం. 826, ఇంటి నెం. 6-8 (సమీపం) చ॥గ॥ 193.1/2ల ఇంటి స్థలములో 3 అంతస్తుల భవనం, సదరు గ్రామంలో రి.స.నెం. 579/2లో పురా య. 4-58ట్లులో య.0-91ట్లులో ఉత్తరం వైపు య. 0-70ట్లు భూమిని ఇల్ల స్థలము విభజింపగా ప్లాటు నెం.6లో గల చ॥గ॥ 317.1/2ల స్థలము య. 1-02ట్లు, రి.స.నెం. 13 పురా య.7-27ట్లు, రి.స.నెం.14 పురా య.14-9ట్లులో తూర్పు వైపు య.2-90ట్లు, రి.స.నెం. 11/2లో పడమర వైపు పురా య.3-07ట్లులో య.2-07ట్లు, రి.స.నెం. 9/1 పురా య.3-18ట్లులో య.1-00ట్లు మొత్తం కలిపి య.14-26ట్లు కొత్త రి.స.నెం. 27/1, య.0-34ట్లు, రి.స.నెం. 28/4బి, య.0-05ట్లు, రి.స.నెం. 28/5, య.0-11ట్లులో య.0-50ట్లు సదరు భూమికి 1/48వ వంతు బోరు వెల్ య.0-02ట్లు భూమి హక్కు మరియు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, కడకట్ల గ్రామ రెవెన్యూ గ్రామము తాలూక రి.స.నెం. 17/3సి, దక్షిణం వైపు య.0-50ట్లు ఆకుమళ్ళ చెరువు భూమి మరియు రి.స.నెం.17/3సి, య.0-02ట్లులో బోరు భూమిలో గల 1/48 వంతు హక్కు గల భూములు మాక్లయింట్లుకు మరియు మా క్లయింట్ల గారి తండ్రి గారైన ఉయ్యూరి శ్రీనివాసరావుకు జాయింటు కుటుంబమునకు సంబంధించిన ఆస్తులైయుండి, జాయింటుగా అనుభవిచుచున్నాము. సదరు స్థిరాస్థులను “3” వాటాలుగా పంపకం చేయమని మా క్లయింట్లు తండ్రి గారైన ఉయ్యూరి శ్రీనివాసరావుకు ది.01-05-2023వ తేదీన ప్లీడరు గారి ద్వారా నోటీసులు పంపించియున్నారు. సదరు నోటీసు అందిన దరిమిలా మా క్లయింట్లు తండ్రి గారైన శ్రీనివాసరావు గారు చట్టరీత్యా చెల్లని దస్తావేజులు వారి యొక్క దగ్గర బంధువులు, అనుయాయులు, మరియు స్నేహితుల పేరున దస్తావేజులు సృష్టించుటకు ప్రయత్నించుచున్నారని మా క్లయింట్లుకు తెలియవచ్చినది.

సదరు స్థిరాస్తులు మా క్లయింట్లు మరియు సదరు శ్రీనివాసరావు జాయింటు అనుభవంలో ఉండి నా క్లయింట్లు తండ్రి గార్కి ఎటువంటి దస్తావేజుల ద్వారా హక్కులు బదిలీ చేయు హక్కు లేదు. సదరు స్థిరాస్థులు ఏవిధమైన దస్తావేజులు సృష్టించినను సదరు స్థిరాస్తులపై సృష్టించబోవు దస్తావేజులకు ఎటువంటి చట్టబద్ధత లేదని మరియు మా క్లయింట్లు పై ఎటువంటి బద్దింపు లేదని మరియు సదరు దస్తావేజులు మా క్లయింట్లు తండ్రి ద్వారా పొందువార్లకు ఏవిధమైన హక్కులు కలగవని, అయినప్పటికీ దస్తావేజులు పొందిన యెడల వారు నష్టపోవుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం, ది.03-06-2023.

ముద్దాని శ్రీనివాసరావు
ఈడా ఫరోత్ బాబు
న్యాయవాదులు, తాడేపల్లిగూడెం.
సెల్: 94418 80541, 79892 78168